# లోకయాత్ర

"శక్రచాప వక్రరేఖ పల్లకి!

మధు స్వప్న శాఖ, పల్లకి!"

తూర్పున ఎర్ర ఎర్రని చిరుచిరు వెలుగులు వస్తున్నాయి. ప్రశాంత వేళ - చల్లని గాలి కదులుతూండగా బోయీలు పల్లకీ ఎత్తారు. సన్నని లయతో ఊపుతో, వాళ్ళ మూలుగులు. ఆ మూలుగుల్లో బరువు. విసుగు వేసటలు, వున్నాయా? ఎంత ఊర్పు! ఎంత ఓర్పు?

ఒకసారి ఆ యెక్కినవాడు పల్లకీ దిగి తాను మోస్తే ఎట్లా వుండునో ఊహించాడా?

ఊహిస్తే ఇంకేముంది? ఎప్పుడూ ఎక్కలేదు. వ్యవస్థ స్తంభించి పోతుంది. ఆ వ్యవహారం మనస్సులోకి రానివ్వకూడదు. లోకయాత్ర "ముగ్ధమోహనం"గా సాగిపోవలసిందే!

బోయీలు సాగిపోతున్నారు. పెండ్లికుమారుడు వేలాడే కుచ్చు ఒకటి చేతితో పట్టుకుని కూర్చున్నాడు.

"వక్రరేఖ పల్లకీ" మాట విడగొడితే—ఎంత చిత్రంగా మారింది! అనుకున్న దేమిటి? జరిగిందేమిటి?

ఊర్వశినీ, మేనకను కోరనూలేదు తన తాహతుకు. దొరుకుతారని నమ్మకమూలేదు. కాని—తనలాగే తగిన వయసున్న దానిని, మనసున్న దానిని వెదకి ఎంచుకుని చేసుకుందామనుకున్నాడు. కొంతకాలం వేచి చూచినా తప్పులేదని భావించాడు.

మెరుపు మెరిసినంతలో ఒక ఇంద్రజాలంలో బయటపడలేనంతగా ఇరుక్కున్నాడు. ఇక లోకంతో యుద్ధంచేసే ఓపిక లేదు. ఏమి తిని యుద్ధం చేయడం? ఆశయాలు "తినడానికి" పనికిరావని ఇప్పుడే తెలిసింది.

"ప్లాట్‌ఫారాలు" ఇళ్ళు కావనికూడా ఎవరూ చెప్పకుండానే తెలిసింది. పాము నిలువుగా నిలిచి వంకరగా పడగవిప్పినట్టున్న ఆ పల్లకీ బొంగు చూస్తే తన బ్రతుకు ఎంత వంకర తిరగదలుచుకున్నదో – పాము పడగ ఎంత దగ్గరవుతున్నదో – జ్ఞాపకం వచ్చి చిన్నబుచ్చుకున్నాడు. "మధు స్వప్నశాఖ!" ఓహో! ఎంత బాగా అన్నాడు కవి! పెండ్లి కోరుకున్న వధువుతో అయితే మధుస్వప్న శాఖ. కాకపోతే ఇంకేమిటి? తన జీవితంలోకి ఎఱ్ఱని పారాణి పాదాలతో, పచ్చని పైటతో, కర్పూరహారం, అత్తరు వాసనలతో అంతకన్న పరిమళించే సిగ్గుబుగ్గలతో, కలువ చూపు

లతో, ఒయ్యారంగా నడిచివచ్చే కులపాలిక "ప్రసవభర వసంతవల్లిక" కాదా?"

ఆ స్వప్నం విరిగింది, మెలుకువ వచ్చింది !

పెండ్లి. పెద్ద తాటాకు పందిరి, కొత్త వాసన!

విడిది - కోడళ్ళు కుమార్తెల, కోలాహలం - కొత్త చీరల కస కసలు.

"దిగండి, దిగండి"—

మంగళ స్నానాలు - మంత్రాలు - పెద్ద సభ - బొంగురు గొంతు పురోహితుడి మంత్రాలు అర్థంతెలియని అరుపులు, ధ్వనులు-

"అర్థేచ, ధర్మేచ, కామేచ, త్వయైషా, నాతి చరితవ్యా" అన్నాడు పిల్లనిచ్చే ఆయన.

పెండ్లికొడుకు నవ్వుకున్నాడు. వీటి అర్థం ఈ తండ్రికీ, కూతురుకీ మొత్తంగా ఈ సభకు తెలియకపోవడం ఎంత బాగుంది! పెండ్లికొడుకు ఉచ్చారణతో పురోహితుడి జోరు తగ్గింది. ఆ మాటలు సరిగ్గా ఉచ్చరించిన పెండ్లికొడుకును ఆయన ఇంతవరకూ చూడలేదు. "మాంగళ్య తంతునాఽ నేన మమ జీవన హేతునా, కంఠే బధ్నామి, సుభగే! త్వంజీవ శరదాం శతమ్."

ఆ మంత్రం చదువుతూ పెండ్లికుమార్తె కంఠంలో సూత్రం కట్టే టప్పుడు ఆ పిల్లవాడి చేయి ఒణికింది. కళ్ళు తడి అయ్యాయి. అందులో ఏముంది?

"ఓ చిన్నదానా! ఈ మంగళసూత్రంలో నా ప్రాణాలుంచి నీ మెడలో కడుతున్నాను. నీవు నూరేళ్ళు బ్రతుకు. (నన్ను నూరేళ్ళు బతికించు.")

పెండ్లికొడుకు సూత్రం కట్టి ఆ పసిపిల్ల ముఖంకేసి చూశాడు. నిశ్చింతగా - అమాయికంగా కిందకు చూస్తోంది. జాలి వచ్చింది. మనసు తడి అయింది. ఇదేనా ప్రేమ అంటే! తన కళ్ళలోకి వచ్చిన కొత్త బాట సారిని చూచి అతడు నవ్వుకున్నాడు చల్లగా. పెండ్లి అయిపోయింది. బంతులాటలు — నవ్వులు - హాస్యాలు - విందు భోజనాలు - సన్నాయిని - మన్మథ బాణాల్లా-పెండ్లికొడుకును దూసుకుపోయాయి.

తన జీవిత భాగస్వామినిని చూచి పెళ్ళికొడుకు చింత పడలేదు. కర్మవశాత్తు ఒక రాజకుమార్తె ఒక పసిపిల్లవానిని భర్తగా బడసి, ఏమీ కించపడకుండా అతణ్ణి లాలించి పాలించి తుదకు నీవు నా భర్తవు అంటే ఆ పిల్లవాడు — యువకుడై ఆశ్చర్యపడ్డ కథ జ్ఞాపకం వచ్చింది.

ఆ నాలుగు రోజులూ గడిపేసి నిర్విచారంగా బస్సెక్కాడు.

మళ్ళా మామూలు రాజమండ్రి రోడ్లు! వీధులు! రైళ్ళు వస్తు న్నాయి. స్టేషన్లో ఆగుతున్నాయి. వెడుతున్నాయి. బస్సులు జన్మ హక్కుగా ప్రక్క ప్రజల కళ్ళల్లో దుమ్ముకొడుతూ సురక్షితంగా తిరుగు తున్నాయి. ప్లీడర్లు నల్లకోట్లు తొడుక్కుని తాంబూలం నములుతూ కోర్టు లకు వెడుతున్నారు, స్కూళ్ళు, ఉపాధ్యాయులు — గంటలు. తెరవడం మూయడం అంతా మామూలే. తనలో ఏదో తలకిందులైన కొత్త ఏమూలా కనిపించడంలేదు. మిత్రులు మామూలుగా పలకరించారు. కొందరు సాభి ప్రాయంగా - కొన్నాళ్ళు గడిచాయి. సంవత్సరాది వచ్చింది. వెళ్ళింది.

కొత్త సంవత్సరం సుఖమయంగా వుంటుందని ఆశిస్తే – చాలా చిక్కుల్లోకి తీసుకువెళ్ళింది.

హఠాత్తుగా జ్వరం వచ్చింది. 104 డిగ్రీలు దిగలేదు. ఒంటరిగా అద్దె గదిలో గోడలు చూస్తూ గడుపుతున్నా. మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయం- శోషవచ్చింది. చెవుల్లో హోరుగా వుంది. స్పృహ తప్పుతున్నట్టుంది. కళ్ళయెదుట చీకటి తెరలు – క్రమంగా ఆ భావన కూడ చెదరిపోయి ఇది ఇదీ అని చెప్పలేని అయోమయం అయింది. మరణం అంటే అదే గాబోలు - నిష్కారణంగా ఈ జీవితం ముగిసిపోతున్నది. ఏ కోరికలు తీరకుండా, ఏ ఆశలు ఫలించకుండా, మట్టిలో కలిసిపోతోంది. దీనివల్ల చాలామందికి తీరని అన్యాయం జరుగుతుంది. ఆ పసిపిల్ల తెల్లబోయి చూస్తుంది. తనకేం జరిగిందో చెబితేగాని తెలియని అజ్ఞానురాలు, ఏడవడానికికూడా సిగ్గుపడే అమాయికురాలు. "ఈ ఒక్కసారికి చావు రాకుండా ఎవరైనా తప్పిస్తే బాగుండును!" అనుకునే స్పృహకూడా లేదు.

చటుక్కున తలుపు రెక్కలు విడిన చప్పుడు – వచ్చినవాడు 20 ఏళ్లకు చూచిపోదామని వచ్చిన చిరమిత్రుడు. చూచి ఆశ్చర్యంతో కొయ్యయిపోయాడు. చేతితో వెర్రిగా తాగడానికి ఏదైనా కావాలని కష్టంమీద సంజ్ఞ చేశాను. కాఫీ తెచ్చాడు వెంకటశాస్త్రి! చచ్చిపోలేదు. కళ్ళు విడ్డాయి. పలకరించాను. కాసేపు వుండి వెళ్ళిపోయాడు.

అది మశూచికంగా మారడం, కొన్నాళ్ళకు స్నానమయి స్వగ్రామం వెళ్ళడం, వెంటవెంటనే జరిగిపోయాయి. తర్వాత తూర్పుగోదావరిజిల్లా బోర్డులో ఉద్యోగ ప్రయత్నం ఆశాజనకంగా వుంది. మళ్లా స్వగ్రామంనుంచి రాజమహేంద్రవరం రాకతప్పలేదు.